క్లుప్తంగా

టెక్కలి మండల సమావేశం రేపు

టెక్కలి: టెక్కలి మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సమావేశానికి సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

కంచమ్మతల్లి నిజరూప దర్శనం


నిజరూపంలో దర్శనంలో కంచమ్మతల్లి

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారు ఆదివారం అర్ధరాత్రి నుంచి నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దత్తత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని సోమవారం దర్శనం చేసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ముళ్ల పొదలు తొలగించండి


ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన ముళ్లపొదలు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని హుద్‌హుద్ ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన ముళ్లపొదలను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు వంద మందికి హుద్‌హుద్ ఇళ్లను కేటాయించారు. అయితే ప్రస్తుతం నివాసం ఉంటున్న వారికి ఈ జంగిల్ బెడద తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇళ్లచుట్టూ ముళ్ల పొదలు పేరుకుపోవడంతో విష సర్పాలు చేరి భయాందోళన గురి చేస్తున్నాయి. అధికారులు స్పందించి జంగిల్‌ను క్లియరెన్స్ చేయాలని కోరుతున్నారు.

భయపెడుతున్న వీధికుక్కలు


టెక్కలి డిగ్రీ కళాశాలలో గుంపుగా ఉన్న కుక్కలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులు, జనావాసాలు, ముఖ్య కూడళ్లలో విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోకి గుంపులుగా వస్తుండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యధికంగా కుక్కలు చేరి విద్యార్థులతో పాటు సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడానికి వచ్చిన వారిని భయాందోళనకు గురి చేస్తున్నాయి. నిత్యం కుక్కల బెడద ఉండడంతో విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ కళాశాలలకు రావాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్ ప్రారంభం


బస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాస నుంచి విజయవాడకు అధికారులు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును కేటాయించారు. దీన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ముందుగా ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో నాయకులు పి.విఠల్ రావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, డొక్కరి శంకర్‌రావు, సప్ప నవీన్, ఆర్టీసీ అధికారులున్నారు.

డాక్టర్ సీదిరికి అభినందనలు


అప్పలరాజును అభినందిస్తున్న బొడ్డపాడు నాయకులు

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షులుగా నియమితులైన రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బొడ్డపాడు గ్రామానికి చెందిన సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు తదితరులు అప్పలరాజును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వర్మ, విజయ్, మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్ ఉన్నారు.

మహా ధర్నాకు తరలిరండి

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో కులాల ప్రాతిపదికన బీసీల కుల జనగణన చేపట్టాలని కోరుతూ ఈ నెల తొమ్మిదో తేదీన విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు తరలిరావాలని రాష్ట్ర బహుజన సమాజ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేదవర బిసాయి కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీలకు కుల గణన లేకపోవడంతో వారికి దక్కాల్సిన రిజర్వేషన్లు సక్రమంగా వర్తించడం లేదన్నారు.

మండల పరిషత్‌లకు గ్రహణం!

- రెండు చోట్ల సూపరింటెండెంట్లకు ఎంపీడీవోల బాధ్యతలు
- సిబ్బంది లేక సెలవు పెట్టేసిన సోంపేట ఎంపీడీవో
- భర్తీ కాని సిబ్బంది ఖాళీలు



సోంపేట మండల పరిషత్ కార్యాలయం

కంచిలి: జిల్లాలో శివారు నియోజకవర్గమైన ఇచ్ఛాపురంలో మండల పరిషత్ కార్యాలయాలకు గ్రహణం పట్టింది. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో ఎంపీడీవోల నుంచి కిందిస్థాయి సిబ్బంది ఖాళీలు భర్తీ కాలేదు. దీనికి కారణాలు పలు రకాలుగా చెప్పుకొంటున్నారు. శివారు నియోజకవర్గమని కొందరు అధికారులు ఈ ప్రాంతానికి రావడానికి ఇష్టపడడం లేదనే ప్రచారం ఉంది. దీనికి తోడు ఈ ప్రాంతానికి చెందిన అధికారులు, సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తించడానికి మక్కువ చూపించినప్పటికీ స్థానిక అధికార పార్టీ నేతలు అంగీకారం లేకపోవడంతో ఆయా పోస్టులు భర్తీ కావడం లేదనే మాట వినిపిస్తోంది.

కార్యాలయాల్లో ఖాళీలు పరిశీలిస్తే..

ఇచ్ఛాపురంలో ఎంపీడీవో, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మండల ఇంజినీరింగ్ అధికారి రానున్న జనవరిలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. కవిటి మండల పరిషత్‌లో ఎంపీడీవోతో పాటు జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీ ఉండగా.. ఈవోపీఆర్డీ రానున్న ఏప్రిల్ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. కంచిలి కార్యాలయంలో మండల ఇంజినీరింగ్ అధికారి, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు, సోంపేట కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ఈవోపీఆర్డీ కూడా జనవరిలో రిటైర్ కానున్నారు. సోంపేట కార్యాలయంలో సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంతో ఎంపీడీవో అనారోగ్యంగా ఉందని ఈ నెల ఏడు నుంచి 16వ తేదీ వరకు సెలవు పెట్టినట్లు తెలిసింది. ఎంపీడీవో బాధ్యతలను స్థానిక ఈవోపీఆర్డీకి అప్పగిస్తూ జెడ్పీ సీఈవో నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో నియోజకవర్గంలో కంచిలి మినహా ఇచ్ఛాపురం, కవిటి కార్యాలయాల సూపరింటెండెంట్లు, సోంపేట మండల పరిషత్‌కు ఈవోపీఆర్డీలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇచ్ఛాపురం, కవిటి ఎంపీడీవోల నియామకం జరగకపోవడానికి రాజకీయ కారణాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. కవిటి మండలంలో కొన్ని సామాజిక పింఛన్లను నిలిపివేయమని ముఖ్యనేత ఆదేశించడం.. దానికి ఎంపీడీవో ససేమిరా అనడంతో అతన్ని ఈ నియోజకవర్గం నుంచి బదిలీ చేయాల్సిందిగా పైఅధికారులకు ఆదేశించడం ఆయన మందస మండలానికి బదిలీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఖాళీలు భర్తీ కావడంలో బాగా వెనుకబాటు ఉండటంతో పని ఒత్తిడి ఉన్న కొద్దిమంది సిబ్బందిపైనే పడుతోందని ఆందోళన చెందుతున్నారు. వచ్చిన అధికారులు, సిబ్బందిని ఇక్కడ సవ్యంగా పనిచేయనివ్వకుండా అడుగడుగునా అడ్డు పడుతుండటంతో సిబ్బంది ఆందోళన వ్యక్తమవుతోంది.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన


కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి


పలాస: ప్రసంగిస్తున్న ఐ.వి.రమణ


ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ట్రైనర్ హరి


కవిటి: మాట్లాడుతున్న శివాజీ పాణిగ్రహి

కంచిలి: పంచాయతీరాజ్ శాఖలో ఉన్న చట్టాలపై పంచాయతీ సర్పంచ్‌లతోపాటు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టాలపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో వి.తిరుమలరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ హెచ్.వి.రమణమూర్తి, ఈవోపీఆర్డీ ఇ.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

పలాస: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంలు, వార్డుమెంబర్లకు పంచాయతీ విధులు, నిర్వహణ అనే అంశంపై శిక్షణ తరగతులు జరిగాయి. రాజ్యాంగ కల్పిస్తున్న హక్కులు, విధులు గురించి వివరాంచారు. ఎంపీడీవో కె.వసంతకుమార్, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి

ఇచ్ఛాపురం రూరల్: పక్కా ప్రణాళికలు తయారు చేయడం ద్వారానే పంచాయతీలు అభివృద్ధికి నోచుకుంటాయని మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ట్రైనర్ బదకల హరి మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, వీధి లైట్లు నిర్వహణ వంటి తదితర అంశాలను వివరించారు.

సంఘటితకృషి అవసరం

కవిటి: గ్రామపంచాయితీల అభివృద్ధికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజలు,అధికారులు సమష్టి కృషి, అంకిత భావం ఎంతో అవసరమని ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రహి అన్నారు. కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పంచాయతీ చట్టాలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్రపై రిసోర్సుపర్సన్‌లు సభ్యులకు వివరించారు.

కోటబొమ్మాళి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో 38 పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అవగాహన కల్పించార. ఈవోపీఆర్డీ జన్ని ఆనందరావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి


కచేరి చేస్తున్న పట్టాభిరామ పండిట్ బృందం

ఇచ్ఛాపురం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శ్రీమహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి ఆహూతులను అలరించింది. ఆలయం ఆవరణలో ప్రముఖ అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత కళాకారులైన బెంగళూర్‌కి చెందిన పట్టాభిరామ పండిట్ తన దైన శైలిలో చేసిన గాత్రకచేరి ఆకట్టుకుంది. వయోలిన్‌పై మావుడూరు సత్యన్నారాయణ శర్మ, మృదంగంపై మావూడూరు సూర్యప్రసాద్‌శర్మ, మోర్సింగ్ విద్యాంసులు బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ, ఘటం సీహెచ్ వినోద్‌కుమార్, కంజీరా జి.లక్ష్మణమూర్తిలు వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, యాదవకుల సంఘం పెద్దలు ఘనంగా సత్కరించారు..

సోమపోలమాంబకు ప్రత్యేక పూజలు


హోమం చేస్తున్న వేదపండితులు

సోంపేట: సోంపేట పట్టణంలోని సోమపోలమాంబ దేవాలయంలో దుర్గా నవరాత్రులు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలింగార్చన, మహాన్యాస, పూర్వకరుద్ర అభిషేకఅర్చన, హోమం పూజలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

కంచిలి: స్వయంశక్తి, గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం ఎస్.ప్రసాదరావు సిబ్బందికి సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, సిబ్బందితో నెలవారీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాల నెలవారీ గ్రేడింగ్, గ్రామసంఘాల నెలవారీ ఆదాయ, వ్యయాల వివరాలు, సంబంధిత రిజిస్టర్ అప్డేట్ చేయాలన్నారు. వీవోఏలు పూర్తిచేసిన రిజిస్టర్‌తో విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు. మండల సమాఖ్య, గ్రామ సంఘాల ఆడిట్స్, అభయహస్తం, వీవోఏల విధులు, బాధ్యతలు, ప్రాజెక్టు నుంచి వచ్చిన సర్క్యులర్లపై చర్చించారు. సమావేశంలో 44 గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రామారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అలాగే పట్టణంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నయని వీటిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడల్లో రాణించాలి


రిబ్బను కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: గ్రామీణ క్రీడాకారులు కబడ్డీలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఉద్దానం రామక్రిష్టాపురం గ్రామంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించి క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.వెంకన్న చౌదరి మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతంలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రో కబడ్డీ స్థాయిలో క్రీడలు నిర్వహించేందుకు క్రీడా శాఖ మంత్రితో మాట్లాడుతామన్నారు. జిల్లా నలుమూలల నుంచి 70 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణమూర్తి, లింగూడు సోమేశ్వరరావు, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి, కర్ని రమణ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పి.ఈశ్వరరావు, కర్ని జోగారావు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు


తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలో నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావులను మండల పరిషత్ అధ్యక్షుడు పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అధికారులను కలిసిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

వితంతువులకు పింఛన్ ఇవ్వాలని వినతి


ఆర్డీవో సుదర్శణ దొరకు వినతులు అందజేస్తున్న మహిళలు

కాశీబుగ్గ:

సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు సూదికొండ గ్రామానికి చెందిన నిరుపేద వితంతువులు కోరారు. ఈ మేరకు పలాస ఆర్డీవో సుదర్శన్ దొరను సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు శిష్టు గోపి మాట్లాడుతూ.. జనవరి నెలలో ఆన్‌లైన్ చేసి గత ప్రభుత్వం హయాంలో కొంత మంది పింఛన్లు మంజూరయ్యావన్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని అధికారులు నిలిపివేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీరికి వితంతు పింఛన్లు పంపిణీ చేయలేదన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, బగాది సింహాచలం, అమ్మాయమ్మ, దంతగిరి రాజేశ్వరి, దండాసి, వాణి, పల్లెటి నారాయణమ్మ, జోగి లక్ష్మమ్మ, పాలవలస జ్యోతి ఉన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


నందిగాంలో అన్నపూర్ణదేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు


ఇచ్ఛాపురం: అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


కంచిలి: దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


కాశీబుగ్గ: 20వార్డు లేబరుకాలనీలో దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

శరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారు వివిధ రూపాయల్లో భక్తులకు సోమవారం దర్శనం ఇచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గామాతను దర్శించుకొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్

ఇందిరాగాంధీ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలి


ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరాచౌక్ వద్ద గతంలో ఉన్న దివంగత మాజీప్రధాన మంత్రి ఇందిరాగాంధీ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. సోమవారం ఇందిరాచౌక్ కూడలి వద్ద ఆ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని కేటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇందిరమ్మ విగ్రహాన్ని తొలగించారన్నారు. అనంతరం ప్రభుత్వం మారడంతో విడిచి పెట్టేశారన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగుడు వీర్రాజు, జిల్లా ఇన్‌చార్జి గాదం మోహనరావు, పార్టీ ఎస్సీ నాయకుడు తెంబూరు మధుసూదనరావు ఉన్నారు.

కొర్లాం రైతుల సమస్య పరిష్కరించాలి


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కొర్లాం గ్రామస్తులు

సోంపేట: కొర్లాం రెవెన్యూ పరిధిలోని అగ్రహారం చెరువు ఆయకట్టు రైతుల సమస్య పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయకట్టు రైతులు అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ భూములను తరతరాలుగా సాగు చేస్తున్నామని, ప్రస్తుతం ఈ భూములకు సంబంధించి వేరే వ్యక్తి పేరు మీద అడంగల్ కాపీలు వస్తున్నాయన్నాయని.. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో రాంబుడ్డి గణపతి, ఎ.చంద్రశేఖర్, రత్నాల శ్రీను తదితరులు ఉన్నారు.

కళాకారుడుకి నివాళి


అశోక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కాశీబుగ్గ: కళాకారులు ప్రజల తరపున గళాన్ని వినిపించాలని వక్తలు అన్నారు. ప్రముఖ జానపద గాయకుడు సాలిన అశోక్ సంస్మరణ సభను పలాస మండలం పెద్దమాకన్నపల్లి గ్రామంలో గ్రామ పెద్దలు, సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అశోక్ కలలుగన్న ప్రజా కళారూపాలను కాపాడుతామని కళాకారులు అన్నారు. కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షులు రాపాక ధనరాజు, కోశాధికారి మామిడి కృష్ణారావు, గ్రామ పెద్దలు సాలిన కోదండరావు, సాలిన వీరాస్వామి, దాసరి దానేష్, సాలిన కూర్మారావు, రాపాక భాస్కరరావు, మామిడి గణపతి, కుత్తుమ ఢిల్లీశ్వరరావు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించాలి


ఆకుకూరలను పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం వలన ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుందని తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. ప్రకృతి వ్యవసాయ ద్వారా పండించిన పంటలను తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు సోమవారం విక్రయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ సేద్యానికి రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమణమ్మ, ఏపీవో ప్రమీల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది టి.క్రిష్ణవేణి, సుజాత, పుష్ప, లత, జయలక్ష్మి, శ్రావణి ఉన్నారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించి సుదర్శణ దొర

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ అధికారిగా నియమితులైన సుదర్శణ దొర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ)లో డిప్యూటీ కలెక్టర్‌గా, టెక్కలి ఇన్‌చార్జి డిప్యూటీ కలెక్టర్‌గా ఈయన పనిచేశారు. కాగా పలాస ఆర్డీవోగా సుదీర్ఘకాలం పనిచేసిన భరత్‌నాయక్ కర్నూలు జిల్లా పత్తికొండకు బదిలీ అయ్యారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న లండ జగ్గారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతోదహన సంస్కారాలకు ప్రభుత్వం తరఫున మృతుని భార్య స్వాతికి ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ రూ. 25 వేలు సోమవారం అందజేశారు. అలాగే కొళిగాం పాఠశాల ఉపాధ్యాయులు కూడా రూ.15 వేలు సమకూర్చారు.